## క్లుప్తంగా

### నేడు బగలాముఖీ శక్తిపీఠం ద్వితీయ వార్షికోత్సవం



శివ్వంపేట(నర్సాపూర్): నేడు మండల కేంద్రం శివ్వంపేటలో కొలువైన బగలాముఖీ శక్తి పీఠం ద్వితీయ వార్షికోత్సవానికి నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం అమ్మవారికి మహాపూజ, మహామంత్రహవనం, విశేష పూజా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు బగలా ముఖీ ఉపాసకుడు, వేద పండితుడు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ తెలిపారు. ఈ మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మాజీ జెడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా కోరారు.

### చాముండేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు



అమ్మవారికి హారతి ఇస్తున్న అర్చకుడు

చిలప్‌చెడ్(నర్సాపూర్): చాముండేశ్వరి అమ్మవారి ప్రత్యేక పూజలు నిర్వహించామని ఆలయ అర్చకులు తెలిపారు. ఆదివారం మండలంలోని చిట్కుల్ శివారులో మంజీరా తీరాన వెలసిన చాముండేశ్వరి అమ్మవారికి దర్శనానికి భక్తులు తరలి వచ్చారు. అనంతరం భక్తులు అమ్మవారి దర్శనం చేసుకున్నారని, ఇందులో భాగంగా అమ్మవారికి కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### ఎల్‌ఈడీ లైట్లు వితరణ



ఎల్‌ఈడీ లైట్లు అందిస్తున్న శ్రీధర్‌గుప్తా

నర్సాపూర్: ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో వెలుతురు కల్పించేందుకు వ్యాపారి పైడి శ్రీధర్‌గుప్తా ఎల్‌ఈడీ లైట్లు మున్సిపాలిటీ సిబ్బందికి ఆదివారం అందజేశారు. మైదానంలో రాత్రిపూట చీకటిగా ఉండడంతో వాకింగ్ చేయడానికి ఇబ్బందిగా ఉందని, లైట్లు ఏర్పాట్లు చేయించాలని పలువురు వాకింగ్ చేసే వ్యక్తులు తనను అడగడంతో ఎల్‌ఈడీ లైట్లు అందజేసినట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు ఉన్నారు.

### మెడిటేషన్‌పై శిక్షణ



మెడిటేషన్‌పై శిక్షణ ఇస్తున్న సంస్థ ప్రతినిధి

నర్సాపూర్: శివదీక్ష మాలధారులకు శివాలయంలో రాజయోగం శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. నర్సాపూర్‌కు చెందిన హార్ట్‌ఫుల్‌నెస్ మెడిటేషన్ సంస్థకు చెందిన ప్రతినిధులు శ్రీనివాస్‌యాదవ్, ప్రసాద్, అశోక్, చిరంజీవి తదితరులు శివ మాలధారులకు రాజయోగం మెడిటేషన్ శిక్షణ ఇస్తున్నారు.

### మొక్కలు నాటిన నాయకులు



మొక్కలు నాటుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

చేగుంట(తూప్రాన్): మండలంలోని రాంపూర్ గ్రామంలో బీఆర్‌ఎస్ నాయకులు కేసీఆర్ జన్మదినం సందర్భంగా ఆదివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ యూత్ నాయకులు బిస్కె సాయి ఆధ్వర్యంలో కేసీఆర్ జన్మదినం నిర్వహించి గ్రామంలో మామిడి, జామ, కొబ్బరి మొక్కలు నాటారు.

### లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం



పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న మాజీ సర్పంచ్

చేగుంట(తూప్రాన్): మండలంలోని బీకొండాపూర్ లక్ష్మీనర్సింహస్వామి వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా ఆదివారం స్వామివారి కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా కల్యాణంలో భాగంగా మాజీ సర్పంచ్ ప్రవీణరాజిరెడ్డి దంపతులు పట్టు వస్త్రాలను, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి తలంబ్రాలను ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

# చరిత్ర ఘనం.. ఆలయాలు శిథిలం

**రెండు వందల ఏళ్ల క్రితమే వీటి నిర్మాణం**

రామాయంపేట(మెదక్): మండలంలోని కోనాపూర్ బండపై దేవతా విగ్రహాలు లేని రెండు ఆలయాలున్నాయి. గ్రామాన్ని ఆనుకునే ఉన్న పెద్ద పరుపు బండపై సుమారుగా రెండు వందల ఏళ్ల క్రితమే మూడు ఆలయాలు వెలిసినట్లు గ్రామస్తులు చెప్తున్నారు. పరుపుబండపై భారీస్థాయిలో ఖడీరాళ్లతో చూడచక్కగా నిర్మించిన మూడు ఆలయాల్లో ఒక దానిలో శివుడు, నంది విగ్రహాలున్నాయి. ఈ ఆలయాన్ని మరమ్మతులు చేయించిన గ్రామస్తులు నిత్యపూజలు నిర్వహిస్తున్నారు. మిగతా రెండింటిలో దేవతా విగ్రహాలు లేకపోవడంతో పూజలకు నోచుకోవడంలేదు. భిన్నంగా ఉన్న ఈ ఆలయాలు గత వైభవానికి చిహ్నంగా నిలిచాయి. దీనితో ఇవి దేవతలులేని లేని ఆలయాలుగా మిగిలిపోయాయి. వీటిలో ఒకటి 16 ఖడీలతో నిర్మించగా, నాలుగు ఖడీరాళ్లు పడిపోయి పాక్షికంగా శిథిలమయ్యాయి. గతంలో ఇక్కడ యజ్ఞాలు నిర్వహించేవారని గ్రామస్తులు తెలిపారు. దీనిని ఇప్పటికీ 16 గుంజల పందిరిగా వ్యవహరిస్తున్నారు. మరో చిన్న మందిరంలో కూడా ఎలాంటి విగ్రహాలు లేవు.. కాగా ఈ ఆలయాల్లో ప్రతిష్ఠించిన విగ్రహాలను గతంలో ఇతర ప్రాంతాలకు తరలించుకుపోయారని కొందరు, విగ్రహాలను ధ్వంసం చేశారని మరి కొందరు చెబుతుంటారు. ఈ ఆలయాలను యునెస్కో ప్రతినిధులతో పాటు పురావస్తు శాఖ అధికారులు పలు మార్లు సందర్శించి వెళ్లారు. అధికారులు స్పందించి వీటిని అభివృద్ధి చేసి, సంరక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



దేవుడి ప్రతిమలేని ఆలయం



పాక్షికంగా శిథిలమైన ఆలయం

**ఆలయాలను పునరుద్ధరించాలి**



జీర్ణస్థితిలో ఉన్న ఈ ఆలయాలను పునరుద్ధరించాలి. ఇక్కడ ప్రతిష్ఠించిన దేవతల విగ్రహాలను ఇతర గ్రామస్తులు తీసుకెళ్లారని అప్పటి పెద్దలు చెప్తున్నారు. ఈ ఆలయాల్లో దేవుళ్లను ప్రతిష్ఠిస్తే బాగుంటుంది.

– సంజీవరెడ్డి, గ్రామస్తుడు

# ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తాం



కొల్చారం(నర్సాపూర్): ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు



మెదక్‌జోన్: సాయినగర్ కాలనీలో ప్రచారం చేస్తున్న బీజేపీ నేతలు

కొల్చారం(నర్సాపూర్): ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తామని బీజేపీ నాయకులు అన్నారు. మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల బీజేపీ టీచర్స్, పట్టభద్రుల అభ్యర్థులకు మద్దతుగా మండలాధ్యక్షుడు హరీశ్ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం మరింత బలోపేతం కావడానికి తమ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవడం తప్పనిసరి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ టీచర్స్ ఇన్‌చార్జి గిరి, గ్రాడ్యుయేట్స్ ఇంచార్జ్ శేఖర్ యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి రాజేందర్ గౌడ్, నాని, పార్టీ కిసాన్ మోర్చా మండలాధ్యక్షుడు రవి కాంత్, మండలంలోని గ్రామాల బూత్ అధ్యక్షులు సంతోష్, ఆంజనేయులు, పోచందర్, అంజి, అరుణ్, రామకృష్ణ, కృష్ణ, నాయకులు రవి గౌడ్, ఏగొండ పాల్గొన్నారు.

మెదక్‌జోన్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా బీజేపీ టీచర్స్ అభ్యర్థి కొమురయ్య, గ్రాడ్యుయేట్ అభ్యర్థి అంజిరెడ్డిలను గెలిపిస్తే చట్టసభల్లో ప్రజల గొంతుక అవుతారని పార్టీ రాష్ట్ర నాయకుడు మురళీధర్‌గౌడ్ కోరారు. ఆదివారం పట్టణంలోని సాయినగర్ కాలనీలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుద్యోగులు, టీచర్ల గొంతుకగా చట్టసభల్లో పోరాటం చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్దాస్ మల్లేశ్‌గౌడ్, మాజీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, నాయకులు బెండ వీణ, ఎమ్మెల్యే రెడ్డి, పట్టణాధ్యక్షులు నాయిని ప్రసాద్, మధు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# కరాటేలో విద్యార్థుల ప్రతిభ



జిల్లాస్థాయి కరాటే బెల్టులు సాధించిన క్రీడాకారులు

మెదక్ మున్సిపాలిటీ: జిల్లా స్థాయి కరాటే బెల్ట్ ఎగ్జామ్‌లో మెదక్ విద్యార్థులు ప్రతిభను కనబర్చారు. ఆదివారం ఉదయం మెదక్ పట్టణంలోని గుల్షన్ క్లబ్‌లో రెంజుకి షాటోకన్ స్పోర్ట్స్ కరాటే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జిల్లాస్థాయి కరాటే బెల్ట్ ఎగ్జామ్‌ను నిర్వహించినట్లు కరాటే మాస్టర్ దినాకర్ తెలిపారు. ఈ బెల్ట్ ఎగ్జామ్‌కు చీఫ్ ఎగ్జామినర్‌గా రెంజుకి షాటోకన్ స్పోర్ట్స్ కరాటే ఆఫ్ ఇండియా వ్యవస్థాపక అధ్యక్షుడు, కరాటే మాస్టర్ నగేశ్ వ్యవహరించారు. అలాగే అబ్జర్వర్స్‌గా విద్యాసాగర్, మల్లేశం వ్యవహరించారు. వివిధ మండలాల నుంచి సుమారు 100 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఉత్తీర్ణ సాధించిన విద్యార్థులకు కరాటే మాస్టర్ బెల్టులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నేటి సమాజంలో అమ్మాయిలు కరాటే నేర్చుకోవడం ఎంతో అవసరమని తెలిపారు. పీఎం శ్రీ కరాటే సెల్ఫ్ డిఫెన్స్‌లో భాగంగా మూడు నెలల పాటు కరాటే శిక్షణను గవర్నమెంట్ పాఠశాలలో ఇస్తామని వివరించారు. మన జిల్లాకు 27 పాఠశాలలో ఈ కరాటే సెల్ఫ్ డిఫెన్స్ కొరకు మాస్టర్స్ కూడా నియమించామని తెలిపారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్, విద్యార్థులు పాల్గొన్నారు.

# ధార్మిక చింతన అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న మాధవానంద సరస్వతి

- రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతి
- ఘనంగా ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

పాపన్నపేట(మెదక్): ప్రతి ఒక్కరూ ధార్మిక చింతన అలవర్చుకోవాలని రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతి సూచించారు. ఆదివారం పాపన్నపేటలో ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహ పునః ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా స్వామి మాట్లాడుతూ.. జీవితంలో సమయం చాలా విలువైనది అన్నారు. మాఘ చవితిని పురస్కరించుకొని వేద బ్రహ్మణులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు కంఠారెడ్డి తిరుపతి రెడ్డి, లావణ్యరెడ్డి, వివిధ మండలాల నాయకులు హాజరయ్యారు.



పూజల్లో మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి, నాయకులు

**రామలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు**

టేక్మాల్(మెదక్): మండల కేంద్రంలోని రామేశ్వర కుచ్చెపై వెలసిన రామలింగేశ్వరుడికి సంకటహరచతుర్థి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు సంతోష్‌స్వామి ఆలయంలో గణపతిపూజ, రుద్రాభిషేకం, మహాహారతి వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**తునికిలో..**

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి గ్రామ సమీపంలోని నల్లపోచమ్మ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం దేవాదాయశాఖ ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌స్పెక్టర్, ఆలయ ఇన్‌చార్జి ఈఓ రంగారావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శివప్ప, రాజేశ్, విఘ్నేశ్ నల్లపోచమ్మకు ఉదయం పంచామృతాలతో అభిషేకం నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. వాహనాలకు పూజలు చేయించారు. ఆలయ సిబ్బంది భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.

### నేడు కొబ్బరికాయల వేలం

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్లపోచమ్మ ఆలయం వద్ద సోమవారం కొబ్బరికాయల విక్రయం, దుకాణాలు, టెంట్ సామగ్రి అద్దె తదితర వాటికోసం వేలంపాటను నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఈఓ రంగారావు, జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి ఆదివారం తెలిపారు. మార్చి 1, 2025 నుంచి ఫిబ్రవరి 28, 2026 వరకు కొబ్బరికాయల అమ్మకం, మూడు దుకాణాలు, టెంట్ సామగ్రి అద్దె, వాహనాల పార్కింగ్ కోసం ఆలయం వద్ద వేలంపాట నిర్వహించనున్నట్లు చెప్పారు. వేలంలో పాల్గొనేవారు డిపాజిట్ డబ్బులు కొబ్బరి కాయలకు రూ. 5 లక్షలు, దుకాణాలు, టెంట్‌కు రూ. 1 లక్ష, వాహనాల పార్కింగ్‌కు రూ. 25వేలు డీడీ చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని వివరించారు.

### భగీరథ నీటి సరఫరాలో అంతరాయం

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలంలో రెండు రోజుల పాటు మిషన్ భగీరథ తాగునీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని మిషన్ భగీరథ ఏఈ స్వప్న తెలిపారు. కొండపాక పంపింగ్ స్టేషన్ వద్ద ప్రధాన పైప్‌లైన్‌కు సోమవారం మరమ్మతు లు చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ పైప్‌లైన్ మరమ్మతులతో దుబ్బాక నియోజకవర్గంలో నీటి సరాఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. దీంతో సోమవారం సాయంత్రం, మంగళవారం ఉదయం నీటి సరఫరా నిలిచిపోనుందని వివరించారు.

### శివస్వాముల పడిపూజ



పడిపూజలో పాల్గొన్న శివదీక్ష స్వాములు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని భుజిరంపేటలో శివదీక్ష స్వాములు ఆదివారం మహాపడిపూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలో శివస్వాముల సన్నిదానం వద్ద గురుస్వాములు యాదాగౌడ్, గోపాల్ ఆధ్వర్యంలో శివదీక్ష స్వాములు పడిపూజ చేశారు. ఈ సందర్భంగా శివస్వాములు కాశీయాత్రలకు వెళ్లారు. కార్యక్రమంలో శివస్వాములు వీరేశం, మహేశ్, బీరప్ప, శ్రీకాంత్, మధుసూదన్‌రెడ్డి, మల్లేశం, ముత్తయ్య, అనీల్, అంజి తదితరులు పాల్గొన్నారు.

### ఆపదలో అండగా..

దుబ్బాకటౌన్: మున్సిపల్ పరిధిలోని చెల్లాపూర్ 3వ వార్డుకు చెందిన పోతరాజు కిషన్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. కిషన్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న మాజీ కౌన్సిలర్ మల్లారెడ్డి బాధిత కుటుంబాన్ని ఆదివారం పరామర్శించి రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. ఎంపీ రఘునందన్ రావు, ప్రభుత్వ సహకారంతో బాధిత కుటుంబానికి తగిన న్యాయం చేస్తామని చెప్పారు.

# విద్యార్థులు కష్టపడి చదవాలి



వార్షికోత్సవంలో పాల్గొన్న అధ్యాపకులు

చిన్నశంకరంపేట(మెదక్): విద్యార్థులు కష్టపడి చదివితేనే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని నార్సింగి ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ నరేందర్‌గౌడ్ అన్నారు. ఆదివారం నార్సింగి ప్రభుత్వ కళాశాల 12వ వార్షికోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యారంగంలో అనేక విప్లవాత్మక మార్పులు తీసుకొస్తుందన్నారు. అధ్యాపకుల బోధనను, తల్లిదండ్రుల సూచనలు పాటిస్తూ క్రమశిక్షణతో ముందుకుసాగే విద్యార్థులే మెరుగైన ఫలితాలు పొందగలరన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సంస్కృతిక ప్రదర్శనలు పలువురిని అలరించాయి. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# విహారయాత్రకు తరలిన విద్యార్థులు



విహార యాత్రకు తరలివెళ్తున్న విద్యార్థులు

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రంలోని వెల్దుర్తి ఉన్నత పాఠశాల విద్యార్థులు 8, 9, 10వ తరగతుల విద్యార్థులు ఆదివారం తెల్లవారుజామున విహారయాత్రకు తరలివెళ్లారు. ప్రభుత్వ ఖర్చులతో ఈ విహారయాత్ర జరుగుతుందని పాఠశాల హెచ్‌ఎం సాంబయ్య తెలిపారు. వరంగల్ నగరంలోని వెయ్యి స్తంభాల గుడితో పాటు ఇతర దర్శనీయ స్థలాలను సందర్శిస్తామని సాంబయ్య చెప్పారు. ఈ యాత్రతో విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందుతుందని చెప్పారు.

# క్రీడాకారులు ప్రతిభను చాటాలి



ట్రోఫీని అందజేస్తున్న పీసీసీ సభ్యుడు కిషన్ తదితరులు

రేగోడ్(మెదక్): గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే పోటీలు క్రీడాకారులు తమ ప్రతిభను చాటుకునేందుకు ఎంతో ఉపయోగపడతాయని పీసీసీ సభ్యుడు ఎం.కిషన్ అన్నారు. మండల కేంద్రం రేగోడ్‌లో ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి. రెండు రోజుల పాటు ప్రీమియర్ లీగ్ క్రీడా పోటీలను నిర్వాహకులు మహేశ్, మధు నిర్వహించారు. హోరాహోరీగా జరిగిన పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రికెట్ టీం బృందాలకు ట్రోఫీని అందజేసి అభినందించారు.

### ముగిసిన క్రికెట్ పోటీలు

నర్సాపూర్: పట్టణానికి చెందిన అనిల్‌రెడ్డి జ్ఞాపకార్థం రెండు రోజులుగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ సీజన్ 2 పోటీలు ఆదివారం ముగిశాయి. పోటీల్లో డెక్కన్ వారియర్స్ ప్రథమ స్థానంలో నిలువగా గ్రీన్ స్టార్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచారు. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన జట్ల క్రీడాకారులకు నగదు, మెమెంటోలు అనిల్‌రెడ్డి తండ్రి మారుతిరెడ్డి, సోదరులు సునీల్‌రెడ్డి, ఆనంద్ రెడ్డిలతో పాటు స్నేహితులు అందజేశారు.



టోర్నమెంట్‌లో ప్రథమ స్థానంలో నిలిచిన క్రీడాకారులతో పోటీల నిర్వాహకులు

# కొనసాగుతున్న లక్ష్మీనర్సింహస్వామి జాతర



కోనేరులో స్నానమాచరిస్తున్న భక్తులు

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహస్వామి జాతర భక్తిశ్రద్ధలతో కొనసాగుతోంది. అందులో భాగంగా ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పవిత్ర కోనేరులో స్నానమాచరించి లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకున్నారు. కొండపైనున్న స్వామివారిని కాలినడకన వెళ్లి దర్శించుకున్నారు. లక్ష్మీనర్సింహస్వామికి అర్చకులు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ పరిసరాల్లో ఏర్పాటు చేసిన వివిధ దుకాణాల సముదాయం వద్ద భక్తుల రద్దీ నెలకొంది. కార్యక్రమంలో ఆలయ ఈఓ శశిధర్‌గుప్తా, ప్రధాన అర్చకుడు ధనుంజయ్‌శర్మ, సిబ్బంది నర్సింహరెడ్డి, విద్యాకర్‌చారి, ప్రకాష్, ఉన్నారు.

# వైభవంగా బోనాల ఊరేగింపు



మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలో బోనాలతో మహిళలు



చిలప్‌చెడ్(నర్సాపూర్): శీలాంపల్లిలో..

మెదక్ మున్సిపాలిటీ: పట్టణ గౌడ సంఘం ఆధ్వర్యంలో పసుపులేరు ఒడ్డున ఉన్న ఎల్లమ్మ ఆలయ 31వ వార్షికోత్సవాలు నిర్వహించారు. ఆదివారం ఆటోనగర్‌లో నల్లపోచమ్మ, గట్టమ్మ, ముత్యాలమ్మ, బొరంచమ్మకు మెదక్ పట్టణ గౌడ సంఘం ఆధ్వర్యంలో బోనాలను ఊరేగించారు. ఇందులో భాగంగా నవాపేట్, పిట్లంబేస్, ఫతేనగర్, దయరా, నర్సఖేడ్, కొలిగడ్డ, వెంకట్రావునగర్, ఆయా ప్రాంతాల మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యులు రమేశ్‌గౌడ్, విద్యాధర్‌గౌడ్, నాగరాజుగౌడ్, నర్సింలు గౌడ్, ముత్యం గౌడ్, అశోక్‌గౌడ్, మల్లికార్జున్‌గౌడ్, వెంకట్‌గౌడ్, కృష్ణగౌడ్, నాగభూషణం పాల్గొన్నారు.

**శీలాంపల్లిలో..**

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని శీలాంపల్లి గ్రామంలో ఆదివారం ఎల్లమ్మకు ఘనంగా బోనాలు సమర్పించారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో గ్రామవీధుల్లో బోనాలను ఊరేగించి, అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌గౌడ్, రామాగౌడ్, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.